ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ,
రాజకీయ, వివాహ,
జన్మదిన తదితర ప్రకటనల
కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | శనివారం | 16.05.2026 | సంపుటి : 1 | సంచిక : 318 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్

## పెట్రో, డీజిల్ ధరల పెంపు

### లీటర్‌పై కనీసంగా రూ.3 పెరిగిన ధరలు

### ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం



న్యూఢిల్లీ, మే 15 : ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ..

-మిగతా 2 లో..

## ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

### నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై రాహుల్ ఆందోళన

### ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు.



న్యూఢిల్లీ,మే15 : లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన

-మిగతా 2 లో..



## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

### సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి

ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు.

హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి: గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని

-మిగతా 2 లో..



### ప్రధాని పొదుపు

## సూత్రంలో సుప్రీంకోర్టు

### వారానికి రెండ్రోజులు వర్చువల్ విచారణ

న్యూఢిల్లీ, మే 15 : పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు సోమ, శుక్రవారం పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా

-మిగతా 2 లో..

## 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి..

### అప్పటి వరకు నేనే ముఖ్యమంత్రిని

### రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా

### రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా

### సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు.



హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి: గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన

-మిగతా 2 లో..

## కుమారుడిని బండి సంజయ్ అప్పగించాలి

### నైతికత నిరూపణలకు ఇదే సమయం: : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 15 : పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ పారిపోవడం తప్పు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి

-మిగతా 2 లో..




## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్

### జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు

### వివరాలు వెల్లడించిన ఎన్‌టిఏ

ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది.

న్యూఢిల్లీ, మే 15 : దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 274 (కిలో) |
| స్కిన్ లెస్ | 310 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరల పెంపు

### మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం

### మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ

హైదరాబాద్, మే15 :ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే



-మిగతా 2 లో..



## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

### బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి కిందపడ్డ ట్రాక్టర్

### ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం

బెంగళూరు,మే15 : కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మునీరాబాద్ సమీపంలో బ్రిడ్జిపై వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడటంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో

-మిగతా 2 లో..

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

### రక్షణ రంగంలో భారత్ స్వావలంబన దిశగా పురోగతి

### పుట్టపర్తి పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

పుట్టపర్తి,మే15(ఆర్ఎన్ఎ): యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480

-మిగతా 2 లో..






## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మ-రోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

# 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి..

(మొదటిపేజీ తరువాయి)

గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు.



కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పెట్రో, డీజిల్ ధరల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: దిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉ



ఒడనున్నాయి. ఇక డీజిల్ ధరలు: దిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

## కుమారుడిని బండి సంజయ్ అప్పగించాలి

(మొదటిపేజీ తరువాయి)

బండి సంజయ్ నైతిక బాధ్యత తీసుకుని కుమారుడిని అప్పగించాలని.. అలా చేస్తే ఆయన గౌరవం పెరుగుతుందని తెలిపారు. ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని.. పారిపోతే సమస్యలకు పరిష్కారం దొరకదని చెప్పారు. బండి సంజయ్ కింది నుంచి కష్టపడి పైస్థాయికి వచ్చారని.. కుమారుడి కారణంగా ఆయనకు తలవంపులు వచ్చాయని సీఎం అన్నారు. తప్పయినా.. ఒప్పయినా ఆయన నిలబడి సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే కుమారుడిని పీఎస్‌లో అప్పగించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ కేసులో ఎవరిది తప్పనే విషయాన్ని విచారణ అధికారులు తేలుస్తారన్నారు.

## ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

(మొదటిపేజీ తరువాయి)



మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం అంటూ ధైర్యాన్ని ఇచ్చారు.

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

(మొదటిపేజీ తరువాయి)

కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి – కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామన్నారు. 'యుద్ధ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక నుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారు. ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారింది. హెచ్‌ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీ రంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. కొన్నేళ్ల క్రితం రక్షణరంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయి. 2004లో కేవలం భారత్ రూ.46వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాల తయారీ ఉండేది. ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.1.75లక్షల కోట్లకు చేరిందని గర్వంగా చెబుతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారు ఓ కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బ్రిడ్జిపై మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాక్టర్ కిందకు పడిపోయిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే లారీ ఢీకొట్టడంతో వంతెన పైనుంచి ట్రాక్టర్ కిందపడిందని కూడా అంటున్నారుజ ఈ ప్రమాదంలో ఏడాది చిన్నారి సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. కొప్పల తాలూకా మునీరాబాద్ వద్ద వంతెనపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగే సమయానికి ట్రాక్టర్‌లో 16 మంది ఉన్నారు. మునీరాబాద్ సమీపంలోని హులిగమ్మ దర్శనానికి ట్రాక్టర్‌లో భక్తులు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. మృతులను సండూరు, కూడ్లిగి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలాన్ని కొప్పల, విజయనగర ఎస్పీలు పరిశీలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి గల అసలు కారణాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రధాని పొదుపు సూత్రంలో సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది. కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్ ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్-ఫ్రం-హోమ్‌కు అనుమతించాలని సూచించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని, అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రులు, ప్రముఖులు భద్రతా శ్రేణిలో వాహనాలను తగ్గించుకుంటున్నారు.

## గిరిజన ఆర్థిక స్వావలంబనకు ఇప్ప పువ్వు ప్రాజెక్ట్

- గిరిజనుల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, మే 15:** గిరిజన ప్రాంతాల్లో సంప్రదాయ జీవన విధానానికి ఆధారమైన ఇప్ప పువ్వును గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా మలిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'మహువా ఫ్లవర్ ప్రాజెక్ట్ అమలు'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... గిరిజన ఆదివాసీ మహిళలు, రైతులు, యువత, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. అడవుల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు గిరిజన సంస్కృతి, ఆహార సంప్రదాయాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుతం ఇప్ప పువ్వును కేవలం సంప్రదాయ వినియోగానికి మాత్రమే పరిమితం కాకుండా, ఆహార ఉత్పత్తులు, ఔషధ వినియోగాలు, విలువ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి ఉపయోగించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో శాస్త్రీయ సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసి గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా గిరిజన మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సమాఖ్యలను ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేసి గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అటవీ సంపదపై గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ, అదే సమయంలో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర



విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, పోషకాహార భద్రత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్ప పువ్వు ఆధారిత ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అడవి ఉత్పత్తుల విలువను పెంచడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరుల ఆధారంగా స్థిరమైన ఉపాధి అవకాశాలు సృష్టించి యువత వలసలను తగ్గించడం, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలతో అలాగే ప్రభుత్వ యంత్రాంగం ఉమ్మడిగా సమన్వయంతో పైలట్ ప్రాజెక్టులు చేపట్టి, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి , మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గిరిజన ఎమ్మెల్యేలు రామచంద్ర నాయక్,మురళి నాయక్ లతో ాటు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బి.ఎల్. సంతోష్, భద్రాచలం పి.ఓ రాహుల్, ఉట్నూర్ పి.ఓ మంద మకరందు, ఏటూరునాగారం పి.ఓ లెనిన్ వత్సాల్ టొప్పో .పలువురు ప్రముఖ ప్రొఫెసర్లు, నిపుణులు చంద్ర రామారావు పాల్గొన్నారు



## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు

### కేశరావు చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, మే 15:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు,త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం
- పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, మే 15:** పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే పక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు అనసూయ సీతక్క, కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్, కడియం శ్రీహరి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా , ఐటిడిఎ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే , తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ, పోలీసు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారనీ , ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతులపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు. ÷ఖ్యంగా ఈ నెలాఖరుకల్లా వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె ఇండ్లన్నిటికీ లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ పడకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకే లబ్ధి చేకూరేలా చూడాలని స్పష్టం చేసారు. డబుల్ బెడ్ రూం కాలనీల్లో కనీస మౌలిక సదు-పాయాలైన విద్యుత్, మంచినీరు, డ్రైనేజి వంటి వాటి పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న కాలనీల్లో టవర్ ను యూనిట్‌గా తీసుకుని , లబ్దిదారుల అసోసియేషన్ ల ద్వారా పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ÷ాష్ట్రంలో ప్రధానంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీభూములున్నాయని, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య చాలా సరిహద్దు వివాదాలు ఉన్నాయని మంత్రి అన్నారు. రెండు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దీంతో పాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్టు మధ్య కూడా వివాదాలు ఉన్నాయని ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన రోవర్స్ తో సర్వే నిర్వహించి భూ వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. సమావేశాల్లో హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ క్యాన్సర్‌పై అట్లాస్

- సిఎం రేవంత్‌కు అందించిన నోరి
- ఎంతో ఉపయుక్తమైన సమాచారమని సిఎం కితాబు

**హైదరాబాద్, మే 15:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ ను అందజేసిన ప్రభుత్వ సలహాదారు , ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు నోరి దత్రాత్రేడు.. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్తూ పాల్గొన్నారు. తెలంగాణలో క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర నివేదికను అందజేసిన నోరి దత్తాత్రేయుడిని అభినందించిన ముఖ్యమంత్రి. క్యాన్సర్‌పై పోరాటంలో నోరి దత్తాత్రేయుడు రూపొందించిన అట్లాస్ ఎంతో ఉపయోగకరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను అన్వేషించే అవకాశం ఈ నివేదిక ద్వారా లభిస్తుందన్నారు. నివేదికలో అందించిన డేటా ఆధారంగా క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు.

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

- రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, మే 15:** హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారు లను ఆదేశించారు. శుక్రవారం డా.బి. ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణ ప్రభు త్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు. హైదరాబాద్, పూనే,ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ - బెంగళూరు కారిడార్, హైదరాబాద్- చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఊఓఆం మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.




## జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ
- దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం అని వెల్లడి

**సంగారెడ్డి, మే 15:** తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

## భూగర్భజలాల సంరక్షణకు
# కట్టుదిట్టమైన చర్యలు

- త్రాగు నీటి భద్రత పై ప్రత్యేక దృష్టి
- నీటి లభ్యత పెరగడంతో పాటు వినియోగం పెరుగుతుంది
- ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రత్యేక దృష్టి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మే 15 :** భూగర్భ జలాల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,గ్రౌండ్ వాటర్ డైరెక్టర్ లక్ష్మణ్ ,డిప్యూటి డైరెక్టర్ పి.జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణ అన్నది అత్యంత ప్రాధాన్యతంశమని ఈ విషయంలో రైతులకు ప్రత్యేక అవగాహన కలిగించెందుకు అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు. అదే సమయంలో నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చూడడంతో పాటు వృధా గా పోయే నీటిని నియత్రించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణా రాష్ట్రంలో భూగర్భ జలాల లభ్యత పెరుగుతున్నప్పటికీ అదే స్థాయిలో నీటి వినియోగం పెరుగుతున్నందున నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. 2024 తో పోల్చిచూసినపుడు 2025 లో జలాల వినియోగం 45.93 శాతం నుండి 46.86 శాతానికి పెరిగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. భూగర్భ జలాల సంరక్షణ అనేది ఒక ఉద్యమంలా ప్రజల్లోకి టిదుకెళ్లాలని నీటి సంరక్షణలో ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేయాల్సిన ఆవశ్యకతను ఆయన అధికారులకు వివరించారు. అధికంగా భూగర్భ జలాల వినియోగం అవుతున్న ప్రాంతాలలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా నియంత్రణ మీద దృష్టి సారించేయాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకునెందుకు గాను ఇంకుడుగుంటల నిర్మాణాన్ని ఇబ్బడిముబ్బడిగా ప్రోత్సాహించాలని ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల పరిమాణాలని నిరంతరం గుర్తించేందుకు వీలుగా 1,771 ఫిజోమిటర్లను వినియోగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇసుక తవ్వకాల అనుమతులకు ముందు భూగర్భ జలాల శాఖతో తప్పనిసరిగా సంప్రదింపులు జరపాల్సిన అవసరంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. భూగర్భ జలాల మట్టాన్ని మెరుగుపరచడానికి భూగర్భ జలాల శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పరిశ్రమల శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



## కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కరాలు

### డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి కొండా సురేఖ ఆహ్వానం

**హైదరాబాద్, మే15 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్ కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోఛ్ఛారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

## జవహర్‌నగర్ దోపిడీ కేసులో పురోగతి

### ప్రధాన నిందితులను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, మే 15:** జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మమత అలియాస్ మీనా కడాయత్, ఆమె భర్త రమేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఈ దంపతులు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు. ఆ బైక్‌ను యాప్రాల్లోని పెట్రోల్ బంకు వద్ద వదిలి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏజెంట్ భీమ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితులను రేపటిలోగా హైదరాబాద్‌కు తరలించనున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మిగిలిన నిందితులు నేపాల్‌లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ దంపతులను బంధించి.. నేపాలీ ముఠా దోపీడీకి పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో దుండగులు పరారయ్యారు. ఈ దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

- మే 18 -23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలు
- బ్రోషర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మే 15 :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 18 నుంచి 23 వరకు తెలంగాణ వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బ్రోషర్‌ను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పాల్గొన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 18న హైదరాబాద్‌లోని స్టేట్ మ్యూజియంలో మంత్రి జూపల్లి ఈ పర్యాటక వారోత్సవాలను మధ్యాహ్నం ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చారిత్రక వారసత్వ సంపద, సంస్కృతి, ఎకో-టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ÷ాషా సాంస్కృతిక శాఖ, పురావస్తు (హెరిటేజ్) శాఖ, నిథమ్ సంస్థల సమన్వయంతో పర్యాటక శాఖ ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా హెరిటేజ్ వాక్‌లు, పర్యాటక అవగాహన సదస్సులు, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో సమావేశాలు, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

# ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు!



**ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను ప్రమాదంలో పడేసిన ట్రంప్ ఇంకా మేల్కొనలేదు. తనవల్ల ప్రపంచం అతలాకుతలం అయ్యిందే అన్న కించిత్ చింతన కూడా కానరావడం లేదు. పైపచ్చు..ఇరాన్‌ను భూమండలం మీద లేకుండా చేస్తామని కూడా ప్రకటించారు. ఇరాన్ సంగతి ఎలా ఉన్నా...భారత్ లాంటి దేశాలు చమురు ధరలతో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం తప్పేట్లుగా లేదు. చమురు రవాణా ఆగిపోవడంతో పాటు, ముడి చమురు ధరలు పెరగడంతో నానాయాతన పడాల్సి వస్తోంది. తాజాగా భారత్‌లో పెట్రో, డీజిల్ దలరు పెరిగాయి. ఈ పెరుగుదల ఒక్క ఇంధనంపైనే ఉండదు. ఇకనుంచి అన్నిరంగాల పై దీని ప్రభావం పడుతుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయి. విమానయాన రంగం ఇప్పటికే గగనకుసుమమైంది. ఇది మరింత ప్రమాదంలో పడనుంది. వెరసి సామాన్యుల బతుకులు భారం కానున్నాయి.**

పొదుపు మంత్రం ప్రకటించిన ప్రధాని మోడీ కాన్వాయ్‌లను తగ్గించారే తప్ప, అసలు పొందుపు విషయంలో మాట్లాడడం లేదు. దేశంలో ప్రజాప్రతినిధుల దుబారాను తగ్గించే ప్రయత్నాలపై ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. దీనికితో తోడు ఈ సంక్షోభం దృష్ట్యా ఐటి కంపెనీల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ప్రధాని మోడీ ఇచ్చిన వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం అమలు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కరోనా సమయంలో విధిలేక ఆఫీసులు మూసుకున్న ఐటి కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితం చేయదల్చుకోలేదు. దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేసే విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, దేశీయ ఐటీ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌పై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రతిరోజూ సగటున 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల అటు ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా, భారీగా ఇంధనం ఖర్చవుతోంది. ప్రధాని సూచన మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో ఈ విధానం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి.

నగరంలోని మొత్తం ఐటీ ఉద్యోగులలో కనీసం సగం మంది, అంటే సుమారు 4.5 లక్షల మంది వారానికి కేవలం మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా అద్భుతమైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నెలకు దాదాపు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఇలా ఒక్కో నగరాన్ని తీసుకుంటే గణనీయమైన మార్పులు ఉంటాయని అంటున్నారు. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం విజయవంతంగా అమలు జరిగినప్పటికీ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తుండగా, కొన్ని చిన్న స్థాయి సంస్థలు మాత్రం ఈ విధానం వల్ల తమ ఉత్పాదకత దెబ్బతింటుందని లేదా ఇతర నష్టాలు వస్తాయని ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వస్తే తప్ప ఈ విషయంలో క్లారిటీ వచ్చేలా లేదు. కేవలం వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాకుండా, పెట్రోల్ , డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం కూడా అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి నుండే పని చేయడం వల్ల ఇంధన దిగుమతులు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ పెరగడానికి తోడ్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం ఒక కీలక మలుపు కానుంది. ఇకపోతే ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ఐటి కంపెనీలు కుదింపు మోజులో పడ్డాయి. ఎడాపెడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించిన అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్.. తాజాగా మరో షాకిచ్చింది.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి పలు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పక్రియ ద్వారా విద్యార్థులకు జారీ చేసిన జాబ్ ఆఫర్ లెటర్లను, ప్రీ-ప్లేస‌మెంట్ ఆఫర్ల (పీపీఓ)ను కంపెనీ రద్దు చేసింది. ఒరాకిల్ తాజా నిర్ణయంతో ప్రభావితమైన కాలేజీల్లో ఎన్ఐటీ వరంగల్, వీఎన్ఐటీ నాగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ బీహెచ్‌యూ కూడా ఉన్నాయి. ఆఫర్ లెటర్ల రద్దు విషయాన్ని కంపెనీ ఈ వారంలోనే విద్యార్థులకు వెల్లడించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందుకంటే, చాలావరకు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రాంగణ నియామకాల విషయంలో ఒక విద్యార్థి- ఒక ఉద్యోగం విధానాన్ని అనుసరిస్తున్నాయి. అంటే, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పక్రియలో ఒక కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ అందుకున్న విద్యార్థికి ఇతర కంపెనీల ఆఫర్లను దక్కించుకునే అవకాశం ఉండదు. దాంతో ఒరాకిల్ ఆఫర్ కోల్పోయిన వారిప్పుడు కొత్త ఉద్యోగం కోసం అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన సిస్కో కూడా భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా సిబ్బంది సంఖ్యను దాదాపు 4,000 మేర తగ్గించుకునే ఆలోచనలో ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభావిత సిబ్బందికి నేరుగా తెలియజేయడం జరుగుతుందని కంపెనీ పేర్కొంది. సిస్కో కూడా తన పెట్టుబడులను కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు వేగం గా వృద్ధి చెందుతున్న ఇతర విభాగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నాల్లో ఉంది. మైక్రోసాఫ్ట్‌పరమైన వృత్తి నిపుణుల సోషల్ నెట్‌వర్కింగ్ లింక్డ్‌ఇన్ సైతం ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. వృద్ధి చెందుతున్న విభాగాలపై దృష్టిపెట్టేందుకు సిబ్బంది పునర్వ్యవస్థీకరించాలను కుంటున్న కంపెనీ.. అందులో భాగంగా 5 శాతం ఉద్యోగాలకు కోత పెట్టాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లింక్డ్‌ఇన్‌లో ప్రపంచవ్యాప్తంగా 17,500 ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా ట్రంప్ పెట్టిన కుంపటి ఇప్పట్లో చల్లారేలా లేదు. ప్రపంచ ఆర్థిక స్థితిని ఎంతగా దిగజారుస్తుందో ఇప్పుడే చెప్పలేం. భారత్ ఆర్థిక వ్యవస్థపై మాత్రం తీవ్ర ప్రభావం పడడం ఖాయమని చెప్పవచ్చు.

# గతేడాది కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్

- లీక్ పేపర్లతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు
- టెన్త్. ఇంటర్‌లో అత్తెసరు మార్కులు వచ్చినా నీట్‌లో హవా
- గతేడాది లీక్ ఆనవాళ్లపై దృష్టి సారించిన సీబీఐ





**న్యూఢిల్లీ, మే 15 :** నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయట పడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తుంది. దీంతో ఈ యేదాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరిలు ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది. వికాస్‌కు పదో తరగతిలో 63శాతం, 12వ తరగతిలో 55శాతం మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సెంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69శాతం , 12వ తరగతిలో 91శాతం మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320- 342 దాటలేదు. కానీ, 2025లో హఠాత్తుగా 92.53 పర్సంటైల్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఇక మరో కజిన్ సోనియాకు 10వ తరగతిలో 63?, 12వ తరగతిలో 89? మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 320 మార్కులతో సరిపెట్టుకొంది. సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 49 మాక్‌టెస్ట్‌లు రాస్తే 341-361 మధ్యే మార్కులు వచ్చాయి. అదే నీట్ పరీక్ష రాస్తే మాత్రం అలవోకగా 94.07 పర్సంటైల్‌తో ప్రభుత్వ కాలేజీలో సీటు పొందింది. ఇక పలాక్‌కు 10వ తరగతిలో 93శాతం, 12వ తరగతిలో 89 శాతంమార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 512 మార్కులు మాత్రమే సాధించింది. సికార్‌లోని కోచింగ్ సెంటర్లలో నిర్వహించిన 50 నమూనా పరీక్షల్లో ఆమెకు ఏనాడు 515-550 మార్కులు దాటలేదు. కానీ, 2025 నీట్‌లో 98.61 పర్సంటైల్‌తో జైపుర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఇప్పుడు అదే కుటుంబం లోని రిషి కోసం పేపర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడు 10వ తరగతిలో 43శాతం, 12వ తరగతిలో గ్రేస్ మార్కులు 50శాతం సాధించాడు.

# వచ్చే ఏడాది నుంచి నీట్ ఆన్‌లైన్ పరీక్ష

- లీకేజీని అరికట్టేందుకు చర్యలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**న్యూఢిల్లీ, మే 15 :** నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం అని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.



## ప్రశాంతి నిలయం దర్శించుకున్న లోకేశ్

**పుట్టపర్తి, మే 15 :** శ్రీ సత్యసాయి జిల్లాలో మంత్రి నారా లోకేశ్ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని మంత్రి సందర్శించారు. ప్రశాంతి నిలయంలో లోకేశ్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం సాయి కుల్వంత్ మందిరంలోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేట్ రాష్ట్ర కార్యదర్శి బి.వి రాముడు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్(ఏఎంసీఏ) తయారీ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొననున్నారు. ఏఎంసీఏ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్, ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ, ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. రూ.15,803 కోట్లతో ఏఎమ్‌సీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. దీంతో 7,500 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నారు.

# ఆదివారం నుంచి అధిక జేష్టమాసం

**పెళ్లిళ్లు తదితరాలకు నెలపాటు విరామం**

**శుభముహూర్తాలకు బ్రేక వేళ తగ్గిన బంగారం ధరలు**



**విజయవాడ, మే 15 :** అధిక జేష్టమాసంతో శుభముహూర్తాలు అయిపోయాయి. మరో నెలరోజుల తరవాతనే పెళ్లి తదితర ముహూర్తాలకు ఛాన్స్ ఉంది. గురువారం నుంచి అన్నిరకాల శుభ ముహూర్తాలు ముగిసాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నుంచి మే 13 వరకూ తెలుగు లోగిళ్ళను వివిధ రకాల శుభకార్యాలతో కళకళలాడాయి. ఇప్పుడు ముహూర్తాలు నెల రోజల పైబడి లేవని సెలవిచ్చారు. ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం రానుండడంతో జూన్ 20 వరకూ మంచి రోజులు లేవని పురోహితులు చెపుతున్నారు.జూన్‌లో చివరి 8 రోజులు మంచి ముహూర్తాలున్నాయని పండితులు వివరిస్తున్నారు. జూలైలో మరో నాలుగు రోజులు మాత్రమే ముహూర్తాలున్నాయిని ఆ తరువాత చతుర్మాసం తదితర కారణాలతో ఆగస్టులో 11 రోజులు, సెప్టెంబరులో 4, అక్టోబరులో మరో 4 రోజులు మాత్రం ముహూర్తాలున్నా చతుర్మాసం అడ్డొస్తోందని పురోహితులు అంటు న్నారు. ఆ తరువాత నవంబరులో కార్తీక మాసం కారణంగా 11 రోజులు, డిసెంబరులో మరో 14 రోజుల్లో కూడా అనువైన ముహూర్తాలున్నాయంటున్నారు. దీంతో పెళ్లిళ్లపై ఆధారపడ్డ వారు ,ఇతర కార్యక్రమాలపై ఆధారపడ్డ వారికి ఖాళీగా ఉండాల్సిన ఆగత్యం ఏర్పడింది. కారణం ఏదైనా భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాల పెంపు నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో భారీ కోత కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,090కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో ఏకంగా రూ.2,240ల మేర కోత పడింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,46,750కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ధర రూ.2,050ల మేర తగ్గింది. నగరంలో వెండి ధరలో కూడా రూ.10 వేల కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,390గా ఉంది. ఢిల్లీలో రూ.1,60,240గా, ముంబైలో రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,49,500గా, ఢిల్లీలో రూ.1,46,900గా, ముంబైలో రూ.1,46,750గా ఉంది. చెన్నై సహా పలు నగరాల్లో వెండి దర రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే దేశంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గింది.

## అలజడులు సృష్టిస్తున్న వైసిపి అల్లరిమూకలు

**నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఘాటు విమర్శలు**

**కర్నూలు, మే 15 :** వైసీపీ నేతలపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తీవ్ర స్థాయి-ంలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కర్నూలులో వైసీపీ నేతల ఆందోళనలపై స్పందించారు. రౌడీ మూకల గురించి మాట్లాడాల్సిన అవసరం లేకపోయినా ప్రజాప్రతినిధిగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. వైసీపీ నాయకులు చిల్లర ఇష్యూలను పట్టుకొని అల్లరి మూకలతో అలజడులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కర్నూలులో గురువారం జరిగిన వైసీపీ ఆందోళనలో సగం మందికి పైగా గంజాయి బ్యాచ్, క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన వారే పాల్గొన్నారని తెలిపారు. ఎస్వీ మోహన్ రెడ్డి స్క్రాప్ మనుషులతో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. బాలు అనే వ్యక్తి అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దోచుకున్నాడని తెలిపారు. పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే వైసీపీ నాయకులు ఇలాంటి వారి కోసం ఆందోళనలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మంత్రిపై ఏవేవో మాట్లాడుతున్నారని బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వ్యాపారాలు చేసి కష్టపడి సంపాదించడం తప్పా అని ప్రశ్నించారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చారని వైసీపీ నేత అంటున్నారని.. జగన్ తండ్రి పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదా అని ప్రశ్నించారు. గంజాయి బ్యాచ్‌పై నిఘా పెడతామని స్పష్టం చేశారు. ముచ్చుమర్రిలో మైనర్ బాలికను అత్యాచారం చేసి చంపిన వాళ్లు వైసీపీ కార్యకర్తలే అంటూ ఆరోపించారు. బాలికను చంపిన వారిని వైసీపీ నేతలు పరామర్శించి.. తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా తాను శవ రాజకీయం చేయలేదన్నారు. బాలిక శవం కోసం 5 రోజులు గాలించామని.. అప్పుడు వైసీపీ నేతలంతా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. వైసీపీ నేతలు కాదు...రాక్షసులంటూ విరుచుకుపడ్డారు.

## ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

**ఇక సైకిలే దిక్కన్న అఖిలేశ్ యాదవ్**

**న్యూఢిల్లీ, మే 15 :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించినదే అంటూ తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను తగ్గిస్తుందా అంటూ పశ్చిమబెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన భాజపా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం ఇంధన ధరలు పెంచడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వ్యంగ్యంగా స్పందించారు. 'మీరు ముందుకుసాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను పంచుకున్నారు. 'సైకిల్ పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇదివరకే చెప్పాం' అని దానికి ఆయన క్యాప్షన్ పెట్టారు. కాగా.. సమాజ్‌వాదీ పార్టీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం.



## పెట్రో ధరల పెంపు అనివార్యం

**కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మే 15 :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

జనం వార్త



## మోదీ విమానానికి ఎస్కార్ట్..

### ఫైటర్ జెట్‌తో యూఏఈ ప్రత్యేక స్వాగతం

**యూఏఈ :** ప్రధాని నరేంద్రమోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని యూఏఈ ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం శుక్రవారం మధ్యాహ్నం యూఏఈ గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ ఫైటర్ జెట్ ఎస్కార్ట్‌గా వచ్చింది. తమ వాయుసేన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యుద్ధ విమానం ఎఫ్-16 బ్లాక్ 60 'డెజర్ట్ ఫాల్కన్'ను పంపింది. అబుదాబిలో ప్రధాని విమానం ల్యాండ్ అయ్యేవరకు వెంటే వచ్చింది. ఐరోపా దేశాల పర్యటనకు బయల్దేరిన మోదీ మధ్యలో యూఏఈకి వెళ్లారు. కేవలం కొన్ని గంటలే అక్కడ ఉండనున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

#### యూఏఈపై ఇరాన్ దాడి సరికాదు: మోదీ

యూఏఈపై ఇరాన్ దాడిని ప్రధాని మోదీ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచం మొత్తంమీద ఉందని చెప్పారు. హర్మూజ్ విషయంలో అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు. యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ సమక్షంలో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎల్‌పీజీ సరఫరా, పెట్రోలియం నిల్వలపై ఎంవోయూ కుదుర్చుకుంది. అంతేకాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఎంవోయూలపై భారత అధికారులు సంతకాలు చేశారు.

## తమిళనాడులో విదేశీయుల ఓటు

- ఇమ్మిగ్రేషన్ అధికారుల దర్యాప్తుతో బయటపడ్డ వ్యవహారం
- పదిమందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**చెన్నై, మే 15 :** తమిళనాడు ఎన్నికల్లో విదేశీయులు ఓటేసిన వైనం బయటపడింది. ఎన్నికల అధికారుల కళ్లు గప్పి ఓట్లేయడం సంచలనంగా మారింది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత.. విదేశీయులు ఓటింగ్ పాల్గొన్నట్లు వచ్చిన సమచారంతో దర్యాప్తు జరిపిన ఇమ్మిగ్రేషన్ అధికారులు.. పది మందిని అరెస్టు చేశారు. గత ఎన్నికల్లో ఓట్లేసిన వారిని చెన్నై, మధురై విమానాశ్రయాలలో అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎక్కువగా శ్రీలంకకు చెందినవారే ఉన్నారు. విదేశీ వీసా ఉండి కూడా తమిళనాడులో ఎలా ఓట్లు వేశారనేది ప్రశ్నార్థంకంగా మారింది. అరెస్టైన 10 మందిలో.. రంజిని (59), సర్ఫుదీన్ (68), నీలాంతి (44), జయంతన్ (40), చార్లీ బాలచంద్రన్ (48), చక్రవర్తి లోగప్రియ (50), సునీత చక్రవర్తి (48) మొదలైన వారు శ్రీలకం పౌరులు. వీరితో పాటు బ్రిటన్‌కు చెందిన అయ్యదురై (53), ఇండోనేషియాకు చెందిన టిటిన్ మరియాట్టి (47), కెనడాకు చెందిన జితేంద్రనాథ్ (38) అరెస్టైన వారి లిస్టులో ఉన్నారు. చెన్నై, మధురై ఎయిర్ పోర్టులలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇండియా నుంచి విదేశాలకు వెళ్తున్న క్రమంలో.. వారి చూపుడు వేలుకు ఇంకు గుర్తు ఉండటం గమనించారు. విదేశాల వీసా కలిగి ఉండి.. ఇంకు మార్కు గుర్తులు ఉండటమేంటనే అనుమానంతో విచారించారు. దీంతో వాళ్లు మొన్నటి ఎన్నికల్లో ఓటేసినట్లు ఒప్పుకున్నారు. శ్రీలకం వీసాతో వచ్చిన వారికి కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డులు ఉండటం గమనార్హం. విదేశీయులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం చట్టవిరుద్ధంగా నేరమని.. జారీ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అయితే మొటి అరెస్టు మంగళవారం (మే 12) చేసినట్లు పోలీసులు తెలిపారు. విదేశీయులు ఓటు వేశారనే అంశం ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కారణంగా లక్షల ఓట్లు తొలగించారు. అలాంటి పరిస్థితుల్లో మళ్లీ విదేశీ ఓటర్లు ఎలా ఓట్లు వేశారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం తమిళనాడులో 74 లక్షల పేరర్లను తొలగించారు. దాదాపు 28 క్షల కొత్త ఓటర్లను యాడ్ చేశారు. ఒకవైపు సర్ ప్రక్రియ పూర్తయ్యాక కూడా విదేశీయులు ఎలా ఓట్లేశారని ప్రశ్నిస్తున్నారు. ఓటర్ లిస్టులో పేర్లు ఉంటే.. ఎన్నికల అధికారులు తొలగించలేదా అని ప్రశ్నిస్తున్నారు. అంటే సర్ పక్రియ సరిగ్గా జరగటం లేదా అనే ప్రశ్నలు లేవనెత్తున్నారు.

## జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

### మెరుపు దాడుల్లో భారీమొత్తంలో బియ్యం స్వాధీనం

**అంబేద్కర్ కోనసీమ, మే 15 :** జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం మాఫియాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలోని అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో పోలీసులు ఏకకాలంలో నిర్వహించిన మెరుపు దాడుల్లో భారీ మెంత్తంలో అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జిల్లాలో మరోసారి రేషన్ మాఫియా కార్యకలాపాలపై చర్చకు దారితీసింది. పోలీసుల వివరాల ప్రకారం.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బొలెరో వాహనాల్లో తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. అంబాజీపేటలో పట్టుబడిన ఒక బొలెరో వాహనంలో 44 బస్తాల రేషన్ బియ్యం లభించింది. మొత్తం సుమారు 2,200 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ బియ్యం మలికిపురం, రాజోలు ప్రాంతాల నుంచి ఆలమూరు వైపు తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఇక రెండు వాహనాల్లో కలిపి మొత్తం 50 కిలోల చొప్పున 79 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు పి.గన్నవరం సీఐ భీమరాజు తెలిపారు. ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి లాభాలు ఆర్జిస్తున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలో ఇటువంటి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కోనసీమ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది.

# చైనా పవర్ సెంటర్‌లో ట్రంప్



**బీజింగ్ :** చైనా పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో రోజు ఆ దేశాధినేత షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశానికి 'జోంగ్నాన్‌హై' వేదికైంది. ప్రపంచంలోనే అత్యంత రహస్యమైన, శక్తిమంతమైన రాజకీయ కాంపౌండ్లలో ఇది ఒకటి. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నివాసం ఉండే ఈ ప్రాంగణంలో విదేశీ నేతలకు ఆతిథ్యమి వ్వడం అత్యంత అరుదు. అలాంటిది ఇప్పుడు ట్రంప్‌ను ఇక్కడికి ఆహ్వానించడం ఆసక్తికరంగా మారింది. బీజింగ్‌లో ఉండే 'జోంగ్నాన్‌హై' కాంపౌండ్.. చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ, కౌన్సిల్‌కు హెడ్‌క్వార్టర్. 1950 నుంచి అధికార కమ్యూనిస్ట్ పార్టీ నేతలు ఇక్కడే నివాసం ఉంటూ పాలన సాగిస్తున్నారు. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా ఇందులోనే ఉంటారు. వైట్‌హౌస్ మాదిరిగా ఈ ప్రాంగణంలోకి వెళ్లేందుకు సాధారణ పౌరులకు అనుమతి ఉండదు. చైనా ప్రభుత్వ పాలసీ విధానా లకు సంబంధించి కీలక నిర్ణయాలను ఇక్కడే రూపొందిస్తారు. సంబంధిత నేతలు ఆ నిర్ణయాలను అధికారికంగా ప్రకటిం చేంతవరకు ఈ కాంపౌండ్ దాటి అవి బయటకు వెళ్లవు అనే పేరుంది. ఈ ప్రాంగణంలో లగ్జరీ నివాసాలు, అత్యాధునిక వైద్య సదుపాయాలతో పాటు అనేక సౌకర్యాలు ఉంటాయట. చైనా పాలకులు ఈ ప్రాంగణంలో విదేశీ నేతలకు ఆతిథ్యం ఇవ్వడం అనేది చాలా తక్కువ సందర్భాల్లోనే జరిగింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, బెలారస్ అధినేత అలెగ్జాండర్ లుకాషెంకో వంటి నేతలతో షీ జిన్‌పింగ్ ఇక్కడ భేటీ అయ్యారు. 2014లో నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా.. ఈ కాంపౌండ్‌లోని ఓ ద్వీపంలో జిన్‌పింగ్‌తో కలిసి వాక్ చేసినట్లు అప్పట్లో చైనా అధికారిక మీడియా వెల్లడించింది. 2002లో నాటి అగ్రరాజ్య అధ్యక్షుడు జార్జ్ బుష్ కూడా ఈ కాంపౌండ్‌ను సందర్శించారు. 2017లో ట్రంప్ చైనాలో పర్యటించినప్పటికీ.. నాడు ఈ ప్రాంగణానికి ఆయనను ఆహ్వానించలేదు. తాజాగా ఇప్పుడు జిన్‌పింగ్ తన పవర్ సెంటర్‌లో అమెరికా అధ్యక్షుడికి ఆతిథ్యమివ్వడం ఇరు దేశాధినేతల వ్యక్తిగత మైత్రిని చాటిచెబుతోంది. 'జోంగ్నాన్‌హై' అంటే.. మధ్య, దక్షిణ సముద్రాలను కలిపే వారధి అని అర్థం. ఈ కాంపౌండ్‌లోని సరస్సులు ఒకదానితో ఒకటి అనుసంధానించి ఉండటంతో దీనికీ పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతారు. రాజుల కాలంలో ఇది ఉద్యానవనంగా ఉండేది. 12వ శతాబ్దానికి చెందిన సరస్సులు కూడా ఇక్కడ ఉన్నాయట. చైనా రాచరిక చరిత్ర, సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణాలు ఉన్నట్లు తెలుస్తోంది. క్వింగ్, మింగ్ రాజవంశానికి చెందిన చక్రవర్తులు ఇక్కడ నివాసం ఉండేవారని చరిత్ర చెబుతోంది. 1898లో క్వింగ్ రాజవంశానికి వ్యతిరేకంగా ఇక్కడ తిరుగుబాటు జరిగింది. ఆ సమయంలో మహారాణి డోవేగర్ సిక్స్.. తన మేనల్లుడిని ఈ గార్డెన్‌లోని కృత్రిమ ద్వీపంలో బంధించారట. దీని చరిత్ర, ప్రాముఖ్యతను గుర్తించిన కమ్యూనిస్ట్ నేత మావో జెడాంగ్.. 1949లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను ఏర్పాటుచేసిన తర్వాత.. 'జోంగ్నాన్‌హై'ను తన అధికారిక నివాసంగా ఎంచుకున్నారు. అప్పటినుంచి చైనా పాలకవర్గంలో ఉన్న నేతలకు ఇది అధికారిక రాజకీయ కేంద్రంగా కొనసాగుతూ వస్తోంది. 1972లో నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌ను మావో తన నివాసానికి ఆహ్వానించారు. ఆ పర్యటనతోనే కొన్ని దశాబ్దాల పాటు ఇరుదేశాల మధ్య దౌత్య ప్రతిష్టంభన తొలగి సత్సంబంధాలు ఏర్పడ్డాయి.

## ఉన్నత విద్యారంగం బలోపేతానికి చర్యలు

- యూనివర్సిటీల్లో 1,523 ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ
- విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ వెల్లడి



**అమరావతి, మే 15 :** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం మరో ముందడుగు వేస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. రాష్ట్రంలోని 19 యూనివర్సిటీలు, ఆర్జీయూకేటీ వర్సిటీల్లో 1,523 ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆయన వివరించారు. అందుకు సంబంధించిన నియామకాల నోటిఫికేషన్ ఈ రోజు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 1,020.. అసోసియేట్ ప్రొఫెసర్లు 334 పోస్టులు.. ప్రొఫెసర్లు 63, లెక్చరర్లు 104 సహా 279 బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు వివరించారు. ఈ నియామకాల్లో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీకి అదనపు వెయిటేజ్ వర్తింప చేస్తామని లోకేశ్ తెలిపారు. మే 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం బలోపేతానికి మరో ముందడుగు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 4,343 పోస్టులకు గాను ప్రస్తుతం 972 మంది మాత్రమే సేవలు అందిస్తున్నారని ఆయన సోదాహరణగా వివరించారు. అకడమిక్ ఎక్సలెన్స్, రీసెర్చ్, ఇన్నోవేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎన్ఏఏసీ, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుదల లక్ష్యంగా ఈ నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు. పారదర్శక, ప్రతిభ ఆధారంగా ఈ నియామక పక్రియ చేపడతామని వివరిం చారు. వివరాలను వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. మరిన్ని వివరాలు అందులోనే ఉంటాయని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. యువత భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశమిదేనని ఆయన అభివర్ణించారు. సమయ పాలనతో ఈ నియామకాలు పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా వివరాలను వెల్లడించారు.

# బాబాయే కీచకుడయ్యాడు

- ఇంటికి వచ్చిన బాలికపై పలుమార్లు అత్యాచారం
- కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడి కోసం గాలింపు



**తిరుపతి, మే 15 :** కాపాడాల్సిన బాబాయే కీచకుడయ్యాడు. కన్న బిడ్డలా చూసుకోవాల్సిన బాలికపై కామంతో కన్నేశాడు. పర్సనల్ ఫోటోలను అడ్డుపెట్టుకుని.. సోషల్ మీడియాలో షేర్ చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేసి దారుణానికి ఒడిగట్టాడు. తిరుపతిలో జరిగిన ఈ ఘోరం బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. నిందితుడు రామమూర్తిపై అత్యాచారంతో పాటు ఫోక్సో చట్టం కింద పోలీసులు వేట మొదలు పెట్టారు. సెలవులకని తన ఇంటికి వచ్చిన కూతురు వరుస అయ్యే బాలికపై కన్నేసి కామాంధుడిలా ప్రవర్తించాడు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ పరిధిలోని ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఏప్రిల్ నెలలో వేసవి సెలవుల కోసం తిరుపతిలోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్ళింది. అక్కడ పిన్ని భర్త రామమూర్తి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆమె ఫోన్లో ఉన్న కొన్ని వ్యక్తిగత ఫోటోలను చూసిన నిందితుడు.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఈ ఫోటోలను అడ్డుపెట్టుకుని భయపెడుతూ బాధితురాలిపై రామమూర్తి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్ళిపోయినా ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేయడం మానలేదు. పరీక్షలు రాసేందుకు హైదరాబాద్ వచ్చిన బాలిక మానసికంగా కృంగిపోవడాన్ని గమనించిన తల్లి.. నిలదీయగా అసలు విషయం బయటపడింది. బాబాయే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసి తల్లి షాక్ తిన్నది. వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలం తిరుపతి కావడంతో 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. అనంతరం కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. తిరుపతి పోలీసులు నిందితుడు రామమూర్తిపై కఠిన సెక్షన్లు నమోదు చేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండగా.. పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

## సర్ ఆర్థర్ కాటన్‌కు జగన్ నివాళి

**అమరావతి, మే 15 :** సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళి అర్పించారు. ఈ క్రమంలో వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా.. 'గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి.. లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు. వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేం అని' పోస్టు చేశారు. గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్ గారు. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు ఆయన అని కొనియాడారు.



## భోజ్‌శాల ఆలయం హిందువులదే

### మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు

**ధార్ :** దశాబ్దాలుగా కొనసాగుతున్న మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల/కమల్ మౌలా ఆలయ వివాదంలో అక్కడి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వివాదాస్పద స్థలం ఆలయానికే చెందుతుందని ఇండోర్ ద్విసభ్య ధర్మాసనం హిందూ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ ఆలయాన్ని పురావస్తుశాఖ అధీనంలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఆలయంలో సరస్వతి విగ్రహం ఏర్పాటుచేసుకోవచ్చని కేంద్రానికి సూచించింది. ఈ ప్రదేశంలో ఎన్నోఏళ్ల పాటు దైవ ఆరాధన కొనసాగినట్లు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) చేసిన సర్వేలో తేలిందని ధర్మాసనం పేర్కొంది. పర్మార్ వంశానికి చెందిన రాజా భోజ్‌తో సంబంధం ఉన్న సంస్కృత విద్యాకేంద్రంగా ఇది ఉండేదని పలు చారిత్రక సాహిత్యాలు రుజువు చేస్తున్నాయని పేర్కొంది. మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని ధర్మాసనం ముస్లిం వర్గాలకు సూచించింది. ఇండోర్ ధర్మాసనం తీర్పు నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. భోజ్‌శాల ఆలయ వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. భోజ్‌శాలలోని మధ్యయుగం నాటి స్మారక కట్టడాన్ని హిందూవులు వాగ్దేవి (సరస్వతి) దేవాలయంగా భావిస్తారు. ముస్లింలు దాన్ని కమల్ మౌలా మసీదుగా వ్యవహరిస్తుంటారు. 2003 ఏఎస్ఐ ఒప్పందం ప్రకారం, హిందువులు మంగళవారాల్లో, ముస్లింలు శుక్రవారాల్లో ప్రార్థనలు కొనసాగిస్తున్నారు. అయితే ఈ ప్రదేశంలో ఆరాధన కోసం ప్రత్యేక హక్కులు కోరుతూ హిందూ వర్గం ఈ ఒప్పందాన్ని హైకోర్టులో సవాలు చేసింది. ఆలయ స్థలం మసీదుకు చెందిందని ముస్లిం వర్గాలు వాదించాయి. దీంతో ఈ ప్రాంతంలో 2024లో 98 రోజుల పాటు పురావస్తు శాఖ సర్వే నిర్వహించి 2024 జులై 15న కోర్టుకు నివేదిక సమర్పించింది. దీనిపై మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ బెంచ్ నేడు విచారణ జరిపింది.



## మే 26న కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు

**న్యూఢిల్లీ :** ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న దేశ ప్రజలకు వాతావరణ విభాగం చల్లని కబురు వినిపించింది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు మే 26న కేరళను తాకనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. కానీ ఈసారి ఐదు రోజుల ముందే కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఐఎండీ శుక్రవారం వెల్లడించింది. భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఈసారి ఎల్‌నినో భయాలు ఉన్నాయి. తూర్పు, మధ్య పసిఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల నేపథ్యంలో ఎల్‌నినో ప్రారంభమైందని ఇప్పటికే ఇన్‌కాయిస్ ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు తటస్థ పరిస్థితులు ఉండగా తాజాగా ఎల్‌నినోగా మారిందని వెల్లడించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయని తెలిపింది. రుతుపవనాలు మొదటి దశలో అంటే జూన్ నుంచి జులై ప్రారంభంలో స్థిరమైన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. అయితే ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఎల్‌నినో బలపడి, దేశవ్యాప్తంగా వర్షపాతంపై ప్రభావం చూపొచ్చని పేర్కొన్నాయి.

## ఉన్నావ్ అత్యాచార కేసు..

### కుల్దీప్ సెంగర్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ


**న్యూఢిల్లీ :** ఉన్నావ్ అత్యాచారం కేసులో జీవితఖైదు పడిన భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సెంగర్ జైలు శిక్షను నిలిపివేస్తూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని హైకోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తనను దోషిగా తేల్చడం, యావజ్జీవ కారాగార శిక్ష విధించడంపై సెంగర్ వేసిన అప్పీల్‌ను రెండు నెలల్లోగా పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. ఒకవేళ దోషిగా తేల్చడంపై నిర్ణయం తీసుకోలేకపోతే.. యావజ్జీవ శిక్షను నిలిపివేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌పైనైనా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపింది. ఈ కేసు అర్హతలపై తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని, హైకోర్టు కొత్తగా విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. పోక్సో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యేను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించవచ్చా, లేదా అనే అంశాన్ని కూడా పునఃపరిశీలించాలని సీజేఐ హైకోర్టుకు సూచించారు. 2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డారని కుల్దీప్ సింగ్ సెంగర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. సెంగర్‌ను దోషిగా తేలుస్తూ జీవితఖైదు విధించింది. ఆ తర్వాత సుప్రీం ఆదేశాలతో ఈ కేసు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై గతేడాది చివర్లో విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు సెంగర్ శిక్షను నిలిపివేస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పును బాధితురాలి తరఫు న్యాయవాదులు, సీబీఐ అధికారులు సుప్రీంలో సవాల్ చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. సెంగర్ విడుదలపై స్టే విధించింది. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

# రూపాయి మరింత పతనం..

### తొలిసారి రూ.96 దాటిన విలువ



మంబయి: అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో 95.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. శుక్రవారం మధ్యాహ్నం 96.07 కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో మన రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. రూపాయి విలువ పతనమైతే.. దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజవాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదవుతాయి. నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. విదేశీ ఉన్నతవిద్య కోసం తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసేవారికి మాత్రం లాభం కలుగుతుంది.






## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 96 మార్కును దాటడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 75,497.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,398.72) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. చివరికి 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 96.15 వద్ద కనిష్ఠాన్ని తాకి 95.94కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,560 వద్ద ట్రేడవుతోంది.



## టికెట్ ధరలను భారీగా పెంచిన సన్‌రైజర్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం ఐపీఎల్ టికెట్ల ధరలు భారీగా పెంచింది. ఈ నెల 22న ఉప్పల్ వేదికగా ఎస్‌ఆర్‌హెచ్, ఆర్సీబీ మ్యాచ్ జరగనుంది. సాయంత్రం 5 గంటలకు డిస్ట్రిక్ట్ యాప్‌లో టికెట్ల బుకింగ్ మొదలైంది. ఈక్రమంలో రూ.950 టికెట్ ధరను రూ.2 వేలకు పెంచారు. రూ.1500 టికెట్‌ను రూ.3 వేలకు, రూ.1910 టికెట్‌ను రూ.3,500కు, రూ.2,500 టికెట్ ధరను రూ.4,500కు, రూ.4,500 టికెట్‌ను రూ.6 వేలకు, రూ.7 వేల టికెట్‌ను రూ.10 వేలకు, రూ.23 వేల బాక్స్ టికెట్ ధరను రూ.30 వేలకు పెంచారు. రూ. 30వేల కార్పొరేట్ బాక్స్ టికెట్ ధరను రూ.45 వేలకు పెంచారు.

## పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఐసీసీ డబుల్ షాక్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో పాకిస్థాన్ జట్టు ఆడింది కేవలం మూడే టెస్టులు. అందులో రెండింట్లో ఓడిపోగా.. ఒక్క విజయం మాత్రమే సాధించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఎక్కడో ఎనిమిదో స్థానంలో ఉంది. తాజాగా ఐసీసీ నిర్ణయంతో పాయింట్ల కోతతో పాటు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో భారీ జరిమానా పడింది. దీంతో పాక్‌కు ఐసీసీ డబుల్ షాక్ ఇచ్చింది. ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక కుదేలైంది. ఈ మ్యాచ్‌లో పాక్ స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ రిఫరీ ఆగ్రహానికి గురైంది. ఏకంగా 8 ఓవర్ల పాటు ఆలస్యం కావడంతో డబ్ల్యూటీసీలో ఎనిమిది పాయింట్లను కోల్పోయింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే ఓటమి బాధలో ఉన్న పాక్‌కు ఇది తొలి షాక్. ఆ జట్టు కెప్టెన్ షాన్ మసూద్‌తో పాటు ఆటగాళ్లందరికీ ఒక్కొక్కరిపై 40 శాతం మ్యాచ్ ఫీజులో జరిమానా విధిస్తూ ఐసీసీ రెండో షాక్ ఇచ్చింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ నిర్ణయం మేరకు విధించినట్లు ఐసీసీ ప్రకటన విడుదల చేసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఒక్కో స్లో ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 5 శాతం, ఒక పాయింట్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పుడు పాకిస్థాన్ ఏకంగా 8 ఓవర్లు ఆలస్యం కావడంతో భారీ జరిమానా తప్పలేదు. ప్రస్తుతం ఐసీసీ డబ్ల్యూటీసీ టేబుల్‌లో ఆస్ట్రేలియా (87.50 శాతం), న్యూజిలాండ్ (77.78 శాతం) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణాఫ్రికా (75), శ్రీలంక (66.67), భారత్ (48.15) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి తొలి రెండు స్థానాల్లో నిలిచే టీమ్‌లు డబ్ల్యూటీసీ ఫైనల్‌లో తలపడ్డాయి. ఎవరు విజేతగా నిలిస్తే వారికే టెస్టు గద దక్కుతుంది.



# చెన్నైకి షాక్..

## లఖ్‌నవూ ఘన విజయం

**లఖ్‌నవూ:** ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వరుసగా మూడు విజయాలతో జోరు మీదున్న చెన్నైకి బ్రేక్ పడింది. అలాగే ఈ ఓటమితో ఆ జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. పాయింట్ల పట్టికలో చెన్నై అయిదు నుంచి ఆరో స్థానానికి పడిపోయింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సత్తా చాటింది. 16.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. లఖ్‌నవూ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (90; 38 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. జోష్ ఇంగ్లిస్ (36) రాణించాడు. అబ్దుల్ సమద్ (7) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. నికోలసన్ పూరన్ (32), ముకుల్ చౌదరి (13) నాటౌట్‌గా నిలిచారు. చెన్నై బౌలర్లలో ముకేశ్ చౌదరి, స్పెన్సర్ జాన్సన్ తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు చెన్నై బ్యాటర్లలో కార్తిక్ శర్మ (71; 42 బంతుల్లో; 6 ఫోర్లు 5 సిక్స్‌లు) బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. శివమ్ దూబె 32బి, డెవాల్డ్ బ్రెవిస్ 25, సంజు శాంసన్ 20 పరుగులు చేశారు. ఉర్విల్ పటేల్ (6), రుతురాజ్ గైక్వాడ్ (13) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ప్రశాంత్ వీర్



(13) నాటౌట్‌గా నిలిచాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్లలో ఆకాశ్ మహరాజ్ సింగ్ 3, మహ్మద్ షమీ, షహబాజ్ అహ్మద్ చెరో వికెట్ తీసుకున్నారు.




## అందుబాటులోకి ఐటీఆర్-1, ఐటీఆర్-4 ఆన్‌లైన్ ఫైలింగ్

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను రిటర్నులకు సంబంధించి కీలక ప్రకటన వచ్చింది. చిన్న, మధ్యస్థాయి పన్ను చెల్లింపుదారులు ఫైల్ చేసే ఐటీఆర్-1, ఐటీఆర్-4లను ఎనేబుల్ చేసింది. ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో 2026-27 మదింపు సంవత్సరానికి గానూ ఎక్సెల్ యుటిలిటీ, ఆన్‌ఫైలింగ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆర్జించిన ఆదాయానికి సంబంధించి ఈ ఫారాల ద్వారా రిటర్నులు ఫైల్ చేయొచ్చని తెలిపింది. వ్యక్తిగత ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి జులై 31 వరకు గడువు ఉంటుంది. ఆడిట్ అవసరం లేని ఐటీఆర్-4 దాఖలు చేసే ట్యాక్స్ పేయర్లకు ఆగస్టు 31లోపు ఐటీఆర్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. రిటర్నులు దాఖలు చేయడానికి ఆన్‌లైన్‌లో సదుపాయం అందుబాటులోకి వచ్చినప్పటికీ.. వేతనాలు పొందే వారికి జూన్‌లో ఫారం-16 అందే అవకాశం ఉంటుంది. వీరు అప్పుడే రిటర్నులు దాఖలు చేయడానికి వీలవుతుంది. ఐటీఆర్-1: దేశంలో నివసించే వ్యక్తి ఆదాయం రూ.50లక్షలున్న వారు, వేతనం, ఒక ఇంటి ద్వారా ఆదాయం, సెక్షన్ 11ఏ ప్రకారం రూ.1.25 లక్షలలోపు దీర్ఘకాలిక మూలధన లాభాలు, రూ.5,000 వరకూ వ్యవసాయ ఆదాయం ఉన్న వారికి ఈ ఫారం వర్తిస్తుంది. ఐటీఆర్-4: మొత్తం ఆదాయం రూ.50 లక్షల వరకూ ఉన్నవారు (వ్యక్తులు, హెచ్‌యూఎఫ్, సంస్థలు) వృత్తి, ఆదాయం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్న వారు, దీర్ఘకాలిక మూలధన లాభాలు రూ.1.25 లక్షల్లోపు ఉన్నప్పుడు ఈ ఫారాన్ని వినియోగించాల్సి ఉంటుంది.



## ధరలు పెంచినా నష్టాల్లో ఆయిల్ షేర్లు..

**న్యూఢిల్లీ :** అందరూ ఊహించినట్లే దేశీయంగా చమురు ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున చమురు కంపెనీలు సవరించాయి. ఇన్నాళ్లూ భారీ నష్టాలు చవిచూస్తున్న ప్రభుత్వరంగ చమురు కంపెనీలకు ఇది ఊరట కల్పించే అంశం. అయితే, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినప్పటికీ ఆయా కంపెనీల షేర్లు నష్టాలు చవిచూడడం గమనార్హం. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఇంట్రాడేలో 3 శాతం మేర పతనమై రూ.376కి చేరింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సైతం దాదాపు 2 శాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలైన మహానగర్ గ్యాస్, ఇంద్రప్రస్థ గ్యాస్, గుజరాత్ గ్యాస్ కంపెనీలు కూడా నష్టాల్లో ట్రేడవుతుండడం గమనార్హం. క్రూడాయిల్‌ను ముడిపదార్థంగా వినియోగించే పెయింట్ స్టాక్స్ కూడా క్షీణించాయి. ఇండిగో పెయింట్స్, ఏషియన్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్ స్వల్ప నష్టాలు చవిచూశాయి. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు స్వల్ప మొత్తంలో పెరగడం వల్ల ప్రభుత్వరంగ చమురు సంస్థలకు కొంతమేర ఊరట కల్పించే అంశం అయినప్పటికీ.. నష్టాలను పూడ్చే స్థాయిలో లేకపోవడంతో ఆయిల్ కంపెనీ షేర్లు క్షీణించినట్లు అనలిస్టులు అంచనా వేస్తున్నారు. ఒకప్పుడు 60 డాలర్లుగా బ్యారెల్ క్రూడాయిల్ ధర పశ్చిమాసియా ఉద్రిక్తలతో గరిష్ఠంగా 130 డాలర్ల వరకు చేరిందని, ప్రస్తుతం 107 డాలర్ల వద్ద ట్రేడవుతోందని తెలిపారు. దీంతో రోజుకు రూ.1000 కోట్లు చొప్పున చమురు కంపెనీలు నష్టాలు చవిచూస్తున్నట్లు కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. చమురు ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగి హర్మూజ్ తెరుచుకోకపోతే రాబోయే వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.15 వరకు పెంచొచ్చని మార్కెట్ అంచనా వేసిందని, పెరిగిన మొత్తం తక్కువేనని అభిప్రాయపడుతున్నారు. కాబట్టి మున్ముందు పెంపు నిర్ణయాలు వెలువడొచ్చని అంచనా వేస్తున్నారు.

## ప్రతిసారీ నిరూపించుకోవాల్సిన

# పరిస్థితులు నాకొద్దు : విరాట్

- ఆట కోసం ఏం చేయాలో నాకు తెలుసు
- భారత్ తరపున వరల్డ్ కప్‌లో ఆడటం ఎప్పుడూ అద్భుతమే

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన కోహ్లీ వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. వచ్చే వన్డే ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? లేదా? అనే దానిపై చర్చ సాగుతూనే ఉంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో టీమ్‌ఇండియా సెలక్షన్ కమిటీని ఉద్దేశించి పరోక్షంగా విరాట్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రతిసారి తన నిబద్ధతను నిరూపించుకోవాలనే పరిస్థితులను కోరుకోవడం లేదని స్పష్టంచేశాడు.

నేనెప్పుడూ సిద్ధమే..

- నా దృక్పథం చాలా స్పష్టం. జట్టుకు విలువ తీసుకొస్తానని అనుకుంటే భాగమవుతా. టీమ్‌కు ఉపయోగమని భావిస్తే నన్ను గుర్తించినట్లు అవుతుంది. అలా కాకుండా ప్రతిసారీ నిరూపించుకోవాలని అంటే మాత్రం.. అక్కడ ఉండలేను.
- నా సన్నద్ధత, నిబద్ధతపై అత్యంత నిజాయతీగా వ్యవహరిస్తా. గేమ్‌లో ఎలా ముందుకువెళ్లాలనే విషయంలో నిజాయతీతో ఉంటా. అందుకోసం కష్టపడతా. నాకు అంతటి శక్తినిచ్చిన దేవుడికి ఎప్పుడూ రుణపడి ఉంటా.
- కష్టపడే విషయంలో నేనెవరికీ తక్కువ కాదు. వన్డేల్లో 40 ఓవర్ల పాటు ఈ బౌండరీ నుంచి ఆ బౌండరీ లైన్ వరకూ పరుగు పెట్టమనండి. ఎలాంటి ఫిర్యాదు లేకుండా ఆ పని చేస్తా. అందుకుతగ్గట్టుగానే నా సన్నద్ధత ఉంటుంది.
- 50 ఓవర్లలో.. ప్రతి బంతి కూడా నాకు చివరిదే అన్నట్లుగా భావిస్తా. కెరీర్‌లో నేను ఇదే నా చివరి బంతి అనుకుంటా. నా బ్యాటింగ్ కూడా అదేవిధంగా ఉంటుంది. జట్టు కోసం నావల్ల ఏదైతే అది చేయడానికి సిద్ధంగా ఉంటా.
- ఇవన్నీ చేసినా.. నా స్థానం కోసం నిరూపించుకోవాలంటే మాత్రం అక్కడ ఉండలేను. ఆట కోసం ఏం చేయాలో నాకు తెలుసు. ఏదైనా సిరీస్‌కు రెండు లేదా మూడు వారాల ముందు సన్నద్ధత అయ్యే వ్యక్తిని కాను. ఏడాదంతా రెడీగా ఉంటా. నువ్వు రాబోయే సిరీస్‌లో ఆడాలని చెబితే అందుకు సిద్ధమని చెబుతా.
- నా రోజువారీ దినచర్య అలానే ఉంటుంది. వర్కౌట్లు చేస్తా. మంచి ఆహారం తీసుకుంటా. ఇదేదో కేవలం క్రికెట్ కోసం మాత్రమే కాదు. నా లైఫ్ స్టైల్ అలాంటిది.
- ఇప్పుడు మనం 2026 ఏడాది మధ్యలో ఉన్నాం. అయినా చాలామంది 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడతావా? లేదా? అడుగుతుంటారు. ఆ ప్రశ్నకు నాకు సమాధానం తెలుసు. భారత్ తరపున వరల్డ్ కప్‌లో ఆడటం ఎప్పుడూ అద్భుతమే. అది కేవలం నేను ఒక్కడినే తీసుకొనే నిర్ణయం కాదు



### అప్పుడు టెస్టులకు స్వర్ణయుగం

"టెస్టు జట్టుకు నాయకత్వం వహించడం ఎప్పుడూ గర్వకారణమే. ఎన్నో విజయాలు సాధించాం. ఆ సమయం టెస్టులకు స్వర్ణయుగం అనిపించింది. యువ క్రికెటర్లూ తమ అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఉండేవారు. రిజర్వ్ బెంచ్ కూడా బలంగా ఉండేది. అప్పుడు జట్టులో ఉన్న ఆటగాళ్లకు, నాకు వయసులో పెద్దగా వ్యత్యాసం లేకపోవడమూ కలిసొచ్చింది. ప్రతిఒక్కరితో బాధ్యతలను పంచుకొనేవాడిని. అక్కడ సీనియర్లు, జూనియర్లు అనే గొడవే లేదు. మేమంతా స్నేహితుల్లా ఉండేవాళ్లం. నాయకత్వం చేపట్టినప్పుడు ఒకటే అనుకున్నా. మరో ఏడెనిమిదేళ్ల తర్వాత ఈ జట్టు గురించి ప్రతిఒక్కరూ మాట్లాడుకోవాలని భావించాం. అందుకుతగినట్టుగానే విదేశాల్లో మేం అత్యుత్తమ విజయాలు సాధించాం" అని కోహ్లీ వెల్లడించాడు.

జనం వార్త



## పెద్ది ప్రమోషన్లలో కొత్త ఎమోషన్

### బుచ్చిబాబును లాంగ్ డ్రైవ్ తీసుకెళ్లిన రామ్‌చరణ్

రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు సరికొత్తగా ప్లాన్ చేస్తోంది. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు ప్రచారంలో భాగంగా ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఇది మామూలు ఇంటర్వ్యూలా కాకుండా, రామ్ చరణ్ స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ బుచ్చిబాబును ఒక షికారుకి తీసుకెళ్లారు. ప్రయాణంలోనే వీరిద్దరూ సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సినిమా పనులతో ఇంత బిజీగా ఉన్నప్పటికీ, నన్ను ఇలా లాంగ్ డ్రైవ్‌కు తీసుకువచ్చి నందుకు థాంక్యూ చరణ్ సార్ అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దానికి చరణ్ స్పందిస్తూ.. 'అదంతా సరే కానీ, మన 'పెద్ది' సినిమా ఎప్పుడు వస్తుందో ప్రేక్షకులకు కచ్చితంగా చెప్పు' అని నవ్వుతూ అడిగారు.

## పర్సెంటేజీ విధానంపై 15మందితో కమిటీ

### ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం

సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలకి మధ్య సినిమాల ప్రదర్శనల విషయంలో వివాదం నెలకొన్న క్రమంలో ఓ అంగీకారానికి వచ్చారు. దీనిపై వాణిజ్య మండలి అధ్యక్షుడు డి.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజీ విధానంపై కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. 15 మందితో కమిటీ వేయనున్నట్లు వెల్లడించింది. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై సి.కల్యాణ్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సినిమాల విడుదలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టంచేశారు. కమిటీలో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు ఎగ్జిబిటర్లు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు ఉంటారని ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్మాతలు అల్లు అరవింద్, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, రవి కిషోర్, మైత్రీ రవి, సి.కల్యాణ్, దిల్ రాజు, రాధా మోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, నాగవంశీ, ఎస్ కె ఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని దాదాపు 50 మంది నిర్మాతలు పాల్గొన్నారు. ఎగ్జిబిటర్స్ తరఫున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.



## ఎట్టకేలకు థియేటర్లలోకి కురుప్ప



తమిళ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం 'కరుప్పు' విడుదలకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న అనిశ్చితి అభిమానులను, నిర్మాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే అన్ని సమస్యలు సద్దుమణగడంతో సినిమా ప్రపంచవ్యాప్తంగా మే 15, శుక్రవారం థియేటర్లలో సందడి చేసింది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో విడుదల అవుతోంది. సినిమా విడుదల సందర్భంగా సూర్య అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డియర్ ఆల్.. మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఈరోజు నుంచి 'కరుప్పు', 'వీరభద్రుడు' థియేటర్లలో విడుదల అవుతున్నాయి' అంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ సందేశం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మొదట ఈ చిత్రాన్ని మే 14న విడుదల చేయాలని భావించినప్పటికీ, చివరి నిమిషంలో కొన్ని కారణాలతో విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపింది. కొన్ని ప్రయాణాలు కాలాన్ని మాత్రమే కాదు.. మనసును కూడా పరీక్షిస్తాయి. సినిమా కోసం ఎదురుచూసిన ప్రతి ఒక్కరికీ మేము క్షమాపణలు చెబుతున్నాం. విడుదలలో జరిగిన ఆలస్యం మమ్మల్ని కూడా బాధించింది. అయినప్పటికీ మాపై మీరు చూపించిన నమ్మకం, ప్రేమ మాకు ఎంతో బలం ఇచ్చాయి అంటూ నిర్మాణ సంస్థ భావోద్వేగ ప్రకటన విడుదల చేసింది. అలాగే 'కరుప్పు' కేవలం తమ సినిమా మాత్రమే కాదని, ప్రేక్షకులందరి కథ అని పేర్కొంది. ఎన్నో కష్టాలు, నిద్రలేని రాత్రుల తర్వాత ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపింది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో విడుదల ఆగిపోయిన సమయంలో ముంబై, పుణెలోని కొన్ని థియేటర్లలో సినిమా ప్రదర్శన జరిగినట్లు సమాచారం రావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సినిమా పైరసీకి గురయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. సూర్య సరసన త్రిష హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందించారు.




## పల్లెటూరి ప్రేమకథ దూరదర్శిని

ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని బడ్జెట్ నిర్ణయించడం లేదు, కేవలం కంటెంట్ మాత్రమే శాసిస్తోంది. బలమైన కథాంశంతో వస్తున్న చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తూ సంచలనం సృష్టిస్తున్నాయి. సరిగ్గా అదే బాటలో, కేవలం కథనే నమ్ముకుని ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'దూరదర్శిని'. టైటిల్‌తోనే సగటు ప్రేక్షకుడిలో పాత జ్ఞాపకాలను తట్టిలేపిన ఈ సినిమా, థియేటర్లలో సందడి చేస్తోంది. చిత్ర కథ మట్టపర్రు అనే పచ్చని పల్లెటూరి చుట్టూ తిరుగుతుంది. ఊరిలో కుల రాజకీయాలు, అంతరాలు ఉన్నప్పటికీ.. హరి (సువీక్షిత్), వాణి (గీతికా రతన్) చిన్నప్పటి నుండి ఒకరినొకరు ఇష్టపడతారు. ప్రతి శుక్రవారం దూరదర్శినిలో వచ్చే చిత్రలహరిని చూడటానికి వెళ్లే క్రమంలో వీరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. అయితే, ఊరిలో పలుకుబడి ఉన్న వ్యక్తి, వాణి అన్నయ్య అయిన పరశురామ్‌తో హరికి గొడవ జరగడంతో వీరి ప్రేమాయణం మలుపు తిరుగుతుంది. పేదవాడైన హరి, పెత్తందారీ కుటుంబానికి చెందిన వాణిని ఎలా దక్కించుకున్నాడు? వీరి ప్రేమ కథకు కుల సమీకరణాలు ఎలా అడ్డంకిగా మారాయి? అనేదే ఈ సినిమా ఇతివృత్తం. ర్శకుడు కార్తికేయ 1990ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, అప్పటి మనుషుల భావోద్వేగాలను అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించారు. ముఖ్యంగా 'దూరదర్శిని' అనేది కేవలం టైటిల్ మాత్రమే కాకుండా, కథలో ఒక కీలక పాత్రలా సాగుతుంది. ప్రథమార్ధంలో హీరో హీరోయిన్ల మధ్య సాగే సన్నివేశాలు నెమ్మదిగా సాగినప్పటికీ, పల్లెటూరి అందాలు, అల్లరి చిల్లర కామెడీ ప్రేక్షకులను అలరిస్తాయి. విరామ సమయానికి కథలో వేగం పుంజుకుంటుంది. ద్వితీయార్థంలో కుల వివక్ష వల్ల కలిగే పరిణామాలు, భావోద్వేగపూరితమైన సన్నివేశాలు సినిమాను నిలబెట్టాయి. ÷-లక్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.నూతన నటీనటులైన సువీక్షిత్, గీతికలు తమ నటనతో ఆకట్టుకున్నారు. తొలి చిత్రమే అయినా ఎంతో పరిణతితో నటించి పాత్రలకు ప్రాణం పోశారు. ఇక హీరో స్నేహితులుగా నటించిన భద్ర, బలరామ్ గ్యాంగ్ పండించిన కామెడీ అక్కడక్కడా నవ్వులు పూయిస్తుంది. విలనిజం పండించిన పరశు రాం తన గంభీరమైన నటనతో మెప్పించారు.



## నిజానిజాలు తెలియకుండా విమర్శలు చేయడం ఇష్టం లేదు

సోషల్ మీడియా సెన్సేషన్ టాలీవుడ్ నటి అనసూయ నిత్యం పలు విషయాలపై స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుంటుంది. కానీ ఆమె గత కొద్ది కాలంగా సైలెంట్‌గా ఉంటోంది. ఇటీవల బండి భగీరథ్ కేసు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఆయనపై నమోదైన పోక్సో కేసుపై రోజు రోజుకు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రతి విషయంపై స్పందించే అనసూయ ఈ విషయం మాత్రం స్పందించకుండా సైలెంట్‌గా ఉండటంతో నెటిజన్లు ఆమెకు మెసేజ్‌లు పెట్టారు. దీంతో అనసూయ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా రియాక్ట్ అవుతూ ఎవరూ ఊహించని పోస్ట్ పెట్టింది. ఏదైనా విషయం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నప్పుడు వెంటనే స్పందించడం చాలా ఈజీ అని, కానీ దానివల్ల వచ్చే ఫలితాలను కూడా ఆలోచించాలని ఆమె అన్నారు. నిజాలు ఏంటో అధికారికంగా బయటకు వచ్చే వరకు మనం కొంచెం ఓపికగా, బ్యాలెన్స్‌డ్‌గా ఉండటం మంచిదని సూచించారు. "నేను కూడా అందరిలాగే వార్తలు చూస్తున్నాను, కానీ నిజానిజాలు తెలియకుండా ఒకరిపై విమర్శలు చేయడం నాకు ఇష్టం లేదు" అని క్లియర్ గా చెప్పారు.



## రామ్ లాంటి గొప్ప వ్యక్తి నా పక్కన ఉండడం చాలా అదృష్టం

టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే తన గ్లామర్, క్యూట్ నటనతో కుర్రకారు మనసు దోచుకుంది. ఈ అమ్మడు నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయినప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం అస్సలు తగ్గలేదు. ఆ పాపులారిటీతోనే టాలీవుడ్ స్టార్ హీరోల సరసన వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ దూసుకుపోతోంది. అలాగే తమిళ, మలయాళ చిత్రాల్లోనూ నటిస్తోంది. ఇదిలా ఉంటే.. భాగ్యశ్రీ-రామ్ పోతినేని రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. 'ఆంధ్రా కింగ్ తాలూకా' అనే సినిమా షూటింగ్ సమయం నుంచే రామ్, భాగ్యశ్రీల మధ్య ఏదో నడుస్తోందని, వీరిద్దరూ ప్రేమలో పడ్డారంటూ సోషల్ మీడియాలో రకరకాల వార్తలు తెగ వైరల్ అయ్యాయి. వీరిద్దరూ త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారంటూ గాసిప్స్ వినిపించాయి. అయితే ఈ రూమర్లపై అటు రామ్ కానీ, ఇటు భాగ్యశ్రీ కానీ ఎప్పుడూ స్పందించలేదు, సైలెంట్‌గా ఉండిపోయారు. హీరో రామ్ పోతినేని పుట్టినరోజు కావడంతో, భాగ్యశ్రీ బోర్సే ఆయనకు విష్ చేస్తూ సోషల్ మీడియాలో పెట్టిన ఒక ఇంట్రెస్టింగ్ పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ పోస్ట్‌తో ఆమె తమ మధ్య ఉన్న బంధంపై ఎట్టకేలకు క్లారిటీ ఇచ్చేసింది. జీవితంలో మనకు ఎప్పుడూ ఎవరో ఒకరు స్ఫూర్తిగా నిలుస్తూ ఉంటారు. నిన్ను చూసినప్పుడల్లా నాకు అలాగే అనిపిస్తుంది. నీలోని టాలెంట్, ఎనర్జీ చూసి నేను ఎప్పుడూ ఆశ్చర్యపోతుంటాను. నీలాంటి ఒక గొప్ప వ్యక్తి నా పక్కన మంచి స్నేహితుడిగా ఉన్నందుకు నేను చాలా అదృష్టంగా భావిస్తున్నాను. థాంక్యూ సో మచ్. ఈ పుట్టినరోజు నుంచి నీ జీవితంలో ఒక సరికొత్త ప్రయాణం మొదలవ్వాలి. ఈ ఏడాది నువ్వు సాధించే విజయాలు.. అడవిలో సింహం గర్జించినట్లు, ప్రపంచం మొత్తం మార్మోగిపోయేలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని రాసుకొచ్చింది. భాగ్యశ్రీ పెట్టిన ఈ పోస్ట్‌తో వీరిద్దరి మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమేనని క్లియర్ అయిపోయింది. దీంతో గత కొన్ని రోజులుగా వస్తున్న ప్రేమ, అఫైర్ వార్తలకు ఒక్కసారిగా చెక్ పడినట్లయింది.

## మెగాఫోన్ పట్టిన రామ్ పోతినేని




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే బర్త్ డే సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లూ తన నటనతో, డ్యాన్స్‌తో వెండితెరపై మ్యాజిక్ చేసిన రామ్, ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారబోతున్నారు. తన 23వ చిత్రం ద్వారా రామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌తో రామ్ తన దర్శకత్వ ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'వీర' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ చూస్తుంటే, రామ్ ఒక ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారని స్పష్టమవుతోంది. ఈ సినిమా కోసం రామ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'స్రవంతి మూవీస్' ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' అనే కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. తన కలల ప్రాజెక్ట్‌ను రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకం గా నిర్మించనున్నారు. దర్శకుడిగా తన నిర్ణయం గురించి రామ్ స్పందిస్తూ.. 'ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు' అంటూ పవర్ ఫుల్ కోట్‌ను షేర్ చేశారు. తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు రామ్ పూర్తి స్థాయిలో సిద్ధమైనట్లు ఈ మాటలు చెబుతున్నాయి. భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com